క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యూరు: చింతలపూడి పంచాయతీ సింగరాలపాడులో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా భజన, ప్రవచన కార్యక్రమాలు చేపట్టారు. కార్తీక మాస విశిష్టితను వివరించారు. ఆధ్యాత్మికత భావంపై అవగాహన కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎటపాక: అక్రమంగా గోదావరి నది నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎటపాక తహసీల్దార్ సుబ్బారావు శనివారం పట్టుకున్నారు. రాయనపేట లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద నుంచి ఇసుక లోడ్‌చేసి భద్రాచలం తరలిస్తున్న ట్రాక్టర్లను నిఘా పెట్టి పట్టుకున్నారు. రెండు ఎటపాక ప్రాంతానికి చెందినవి కాగా ఒకటి చోడవరం గ్రామానికి చెందినదిగా తెలిపారు. కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించినట్టు చెప్పారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం రేపు

గూడెంకొత్తవీధి: మండలంలోని జర్రెల పంచాయతీ కేంద్రంలో కొలువై ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు రీమల గోపాలరావు శనివారం తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాలని కోరారు.

గ్రామాల్లో రేషన్ పంపిణీ



జీసీసీ గొడౌన్ ఇన్‌చార్జి కుమారస్వామి

ముంచంగిపుట్టు: రేషన్ లబ్ధిదారులకు సబ్సిడీపై కందిపప్పు, పంచదార పంపిణీ చేయనున్నట్టు జీసీసీ గొడౌన్ ఇన్‌చార్జి పాంగి కుమారస్వామి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 23 పంచాయతీల్లోని 46 రేషన్ డిపోల్లో సబ్సిడీపై 91క్వింటాళ్ల కందిపప్పు, 103 క్వింటాళ్ల 58 కేజీల పంచదార అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. నవంబర్ నెలకు సంబంధించిన రేషన్ పొందే లబ్ధిదారులు కందిపప్పు కిలో రూ.67, పంచదార కిలో రూ.13.50, అంత్యోదయ కార్డులకు అర కిలో రూ.17లకు తెల్లరేషన్ కార్డుదారులకు సబ్సిడీపై అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు సింహాచలం, రత్నంరాజులు

అరకులోయ రూరల్: మండలంలో ప్రభుత్వ గురుకులం బాలుర పాఠశాలలో మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు న్యాయవాదులు సింహాచలం, రత్నంరాజులు శనివారం హక్కులు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్య చదవవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజ మార్పునకు ఆదర్శంగా విద్యార్థులు నిలవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అని రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాల, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తా పడిన కారు

గంగవరం : గోకవరం వైపు నుంచి గంగవరం వైపు వెళ్తున్న కారు పాతరామవరం సమీపంలో అదుపుతప్పి రాయిని ఎక్కించడంతో బోల్తా కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. వారికి ఏ విధమైన గాయాలు కాలేదు. స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని కారులో ఉన్న వారిని బయటకు తీశారు.త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు.

వారధి.. జాడేది?

- వంతెన లేక గ్రామస్తుల అవస్థలు
- చినుకు పడితే నిలుస్తున్న రాకపోకలు
- డోలి మోతలే గతి
- పట్టించుకోని అధికారులు





వాహనాన్ని వాగు నుంచి ఒడ్డుకు చేరుస్తున్న గ్రామస్తులు , కోరుకొండ వద్ద వాగు దాటుతున్న గిరిజనులు



గెడ్డ దాటుతున్న వృద్ధుడు

చింతపల్లి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మన్యంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా అభివృద్ధి పనులు జరిగాయి. ఇందుకోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. దీంతో గిరిజన ప్రాంతాల్లోని శివారు గ్రామాల్లో కూడా రహదారులు, డ్రైనేజీల పనులు జరిగాయి. మన్యంలో ఇంకా చాలా చోట్ల పనులు జరగాల్సి ఉన్నా ఎన్నికల కోడ్ సమీపించడంతో పనులు నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పైబడినా జిల్లాలోని నేటి వరకు ఒక్క అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవు...గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులను చేయడంలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై కూటమి ప్రభుత్వం కనీస దృష్టి సారించక పోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వాగు దాటాల్సిందే

చింతపల్లి మండలంలో అత్యంత మారుమూలన గల బలపం పంచాయతీలో పలు గ్రామాలకు వంతెన లేక రాకపోకలు సాగించేందుకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీలో కొన్ని చోట్ల పూర్తిస్థాయి రహదారి సౌకర్యం లేక



గెడ్డ వద్ద వంతెన నిర్మించాలని కోరుతున్న గ్రామస్తులు

స్థానికులు ఇబ్బందులతోనే కాలం గడుపుతున్నారు. ఆదీవాసీ గిరిజనులకు ఎక్కడికి వెళ్లాలన్నా కొండవాగులు దాటి రావాల్సిందే. ఈ పరిస్థితుల్లో బలపం పంచాయతీ పరిధిలోని సుర్తుపల్లి, కొత్తఊరు, వీరవరం, కుడుములు, బురుదమామిడి, బూరుగుబైలు, తూరుమామిడి తదితర పది గ్రామాల గిరిజనులు ఏ అవసరానికైనా కోరుకొండ సమీపంలో గల కొండవాగును దాటాల్సిన పరిస్థితి నెలకొంది.

చినుకు పడితే అంతే

గిరిజనులు కనీస నిత్యావసర సరకులు కోసం వారపు సంతకు, వైద్యం నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కోరుకొండ గ్రామానికి ఈ వాగు మీదుగానే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. చిన్న చినుకుపడినా కొండ గెడ్డలతో వాగు పొంగి పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో కోరుకొండతో పాటు బలపం పంచాయతీ కేంద్రానికి, అన్నవరం వారపు సంతకు, చింతపల్లి మండల కేంద్రానికి చేరుకోవడం చాలా కష్టంగా మారుతోంది. ఈ రహదారి మీదుగా ప్రయాణం వ్యయ ప్రయాసలు, సాహసంతో కూడి ఉందని స్థానికులు చెబుతున్నారు. తమ గ్రామాలకు సాధారణంగానే వైద్య సేవలు అందించడానికి వచ్చే 104, 108 వాహనాలు నానా ఇబ్బందులు పడుతూ రావాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇక వర్షం పడితే పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయంటున్నారు. గత్యంతరం లేక వైద్య సేవల కోసం రోగులను కాలినడకన డోలి మోతపై ఆరోగ్య కేంద్రానికి వాగు దాటించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నోమార్లు ఈ ప్రాంతానికి వచ్చిన జిల్లా , ఐటీడీఏ స్థాయి అధికారులకు వంతెన సమస్యను విన్నవించుకొన్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొండవాగుపై వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



కోరుకొండ కొండవాగుపై వంతెన నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. చినుకు పడితే రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నాం.పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

– కె.రమేష్ నాయుడు, సర్పంచ్, బలపం పంచాయతీ, చింతపల్లి

వర్షం పడితే రాకపోకలు బంద్



చినుకు పడితే కొండపై ఉన్న గిరిజనుల గ్రామం దాటే పరిస్థితి లేదు. రోడ్డు సౌకర్యం లేదు. ఎంతదూరమైనా డోలీ మోతలతో వాగులు, వంకలు దాటాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాకారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు చేపడితే మాకు రాకపోకలు కష్టాలు తీరుతాయి.

– ఎండ్రపల్లి కృష్ణ, గ్రామస్తుడు, బూరుగుబయలు

ప్రతిపాదనలు పంపాం



బలపం పంచాయతీ కోరుకొండ గ్రామంలో కొండవాగుపై వంతెన నిర్మాణం కోసం గ్రామస్తుల వినతుల మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ మేరకు వంతెన కోసం ప్రతిపాదనలు పంపాం. యంత్రాంగం నిధులు మంజూరు చేసి, ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– ఆశాజ్యోతి, ఎంపీడీవో, చింతపల్లి

సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచ్ భాస్కర్‌ను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినయ్, నాయకులు

అరకులోయ రూరల్: మండలంలోని బొండం పంచాయతీ సర్పంచ్ దురియా భాస్కర్ తండ్రి దురియా విజయరావు(68) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, పార్టీ శ్రేణులతో కలిసి గ్రామానికి చేరుకున్నారు. విజయరావు భౌతికదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు అశోక్‌కుమార్, గోపాల్, నర్సింహమూర్తి, గాసి, అప్పలస్వామి, బాలకృష్ణ, అప్పలరాజు, సునిల్‌కుమార్, గణపతి, బాలరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి

చింతపల్లి: మండలంలో బలపం పంచాయతీ పరిధిలోని అన్నీ గ్రామలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని బలపం సర్పంచ్ కొర్రా రమేష్ నాయుడు కోరారు. బలపం పంచాయతీ కేంద్రంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లోని గ్రామాల్లో గిరిజనులకు ఉపాధి కలిగే విధంగా పనులు కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం ఈసీ మధుసూదనరావు, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ కోటి, సచివాలయం కన్వీనర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏపీఈపీడీసీఎల్ మాజీ సీఎండీ సింహాద్రి



అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను సత్కరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ మాజీ సీఎండీ సింహాద్రి తదితరులు

అరకులోయటౌన్: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను ఏపీఈపీడీసీఎల్ మాజీ సీఎండీ ఓ.సింహాద్రి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అరకులోయలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యేను కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజాసేవకు అంకితమవుతూ ప్రజలకు ఎమ్మెల్యే అందిస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తదితరులున్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారి బదిలీ



డాక్టర్ శశికాంత్

జి.మాడుగుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ టి.శశికాంత్ విశాఖపట్నం మధువాడలో గల సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌నకు బదిలీ అయ్యారు. ఈ పీహెచ్‌సీలో గత కొంతకాలంగా ఆయన వైద్య సేవలు అందించారు. బదిలీపై వెళ్తున్న డాక్టర్ శశికాంత్‌ను పలువురు అభినందించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



పోటీల విజేతలతో ఎస్‌ఐ భూషణం, సిబ్బంది

గంగవరం: యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్య భ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గంగవరం ఎస్‌ఐ డి.భూషణం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మండల స్థాయిలో యువత, విద్యార్థులకు, వ్యాసరచన, క్యారమ్స్, చదరంగం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు శనివారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ భూషణం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో జరిగే అభివృద్ధి, సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొవాలన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని , దీంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకించాలన్నారు.ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హెచ్ఎం వరలక్ష్మి , డిప్యూటీ వార్డెన్ లావణ్య, పీడీ నాగమణి, పీటీ పద్మావతి, ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన



వార్డెన్ వినాయకరావును సత్కరిస్తున్న విద్యార్థులు

చింతపల్లి: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో కార్తీక వనసమారాధన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, థింసా నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల వార్డెన్ వినాయకరావు, తిరుపతిరావులను విద్యార్థులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

ఘాట్‌రోడ్డులో టిప్పర్ బోల్తా



వంజరి ఘాట్‌రోడ్డులో బోల్తాపడిన టిప్పర్

జి.మాడుగుల: జాతీయ రహదారి పనుల్లో భాగంగా రోడ్డుకు మట్టి తరలిస్తున్న టిప్పర్ వాహనం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. గ్రామస్తులు శనివారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వంజరి నుంచి ములకాయపుట్టు మార్గంలో ఘాట్ రోడ్డులో ఎన్‌హెచ్–516ఈ పనులు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన మట్టి లోడ్‌తో ఈ మార్గంలో టిప్పర్ వెళ్తుండగా బ్రేక్ ఫెయిలై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవంతో నిర్మాణదారులు ఊపిరి పీల్చుకున్నారు. టిప్పర్ వాహనం కొంతభాగం దెబ్బతింది.

సీపీఎం మహాసభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ఈ నెల 13న జరగనున్న సీపీఎం మహసభను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి కిడంగి రామారావు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులంతా ఐక్యమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మన్యంలో కాఫీ, మిరియాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఏజెన్సీలో నూరుశాతం ఉద్యోగాలు ఆదివాసీలకే కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలన్నారు. జీవో నంబర్–3 చట్టబద్ధత కల్పించాలని, గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశధోరణితో గిరిజన చట్టాలు నిర్వీరమవుతున్నాయని, మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించనున్న పార్టీ మహాసభలో ప్రజాసమస్యలపై విస్తృతంగా చర్చిస్తామన్నారు. సభలకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు చిన్నబాబు, బాలదేవ్, భగత్‌రాం, మగ్గన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



చింతూరులో జెండాను ఎగురవేస్తున్న ఏటీఏ నాయకులు



నల్లకుంట పాఠశాలలోని వేడుకలో పాల్గొన్న నాయకులు

చింతూరు: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం చింతూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యామల సుబ్బయ్య జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఆవిర్భవించిన తమ సంఘం సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. కన్నయ్య, రవి, బాబూరావు, భద్రయ్య, వెంకన్నబాబు, సీత, ప్రియాంక, మీనా పాల్గొన్నారు.

ఎటపాక: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం నల్లకుంట పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి రామకృష్ణ ఏటిఏ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్–3ని పునరుద్ధరించి, గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి ఆదివాసీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. నాయకులు శివశంకర్, కిరణ్‌కుమార్, రజిని, గంగాభవాని, వెంకటేశ్వర్లు, ప్రవీణ్ తదితరులున్నారు.

దళారుల నుంచి రైతులను కాపాడాలి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

కొయ్యూరు: రాజేంద్రపాలెంలో సీపీఎం మహాసభ శనివారం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ దళారుల బెడద నుంచి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమానికి ముందుగా సీపీఎం నేత సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జీడి, కాఫీ రైతులను దళారుల నుంచి కాపాడేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు ఇవ్వలేదన్నారు. ప్రసాద్, చిట్టిబాబు, శంకర్రావు, చిట్టిబాబు, పెంటయ్య పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన



కిమ్మిలిగెడ్డలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరసింహమూర్తి

రాజవొమ్మంగి: గంజాయి సాగు, రవాణా చట్ట రీత్యా నేరమని దీనికి దూరంగా ఉండాలని ఎస్‌ఐ నరసింహమూర్తి చెప్పారు. మండలంలోని లోతట్టు ప్రాంతం కిమిలిగెడ్డ గ్రామాన్ని ఆయన సందర్శించారు. స్థానికులతో మాట్లాడుతూ పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా, గంజాయి వల్ల అనేక ఇబ్బందులు కలుగుతాయన్నారు. యువత బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలన్నారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ వైర్లు అమర్చవద్దని హెచ్చరించారు.

ఈ పద్ధతి వల్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. యువతకు వాలీబాల్ కిట్‌లను ఎస్‌ఐ నరసింహమూర్తి అందజేశారు. సాయుధ పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

రాజవొమ్మంగి ప్రధాన రహదారిపై ఎస్‌ఐ నరసింహమూర్తి నేతృత్వంలో శుక్రవారం, శనివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించారు. వాహనచోదకులను నిలిచివేసి పరీక్షలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. రికార్డులు తనిఖీ చేశారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

వై.రామవరం: మండలంలోని పెద్ద ఊలెంపాడు గ్రామంలో శనివారం సామూహిక సీమంతం కార్యక్రమం జరిగింది. దానధర్మ చారిటబుల్ ట్రస్టు (హిందూనేషన్ ఫౌండేషన్) సహాయంతో కమిటీ సభ్యులు బొగ్గుల కాటంరెడ్డి, వ్యవస్థాపక అధినేత తోట రామకృష్ణల ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రమంలో అధిక సంఖ్యలో గర్భిణులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గర్భిణులకు పండ్లు, చీర, స్వీట్లు, తాంబూలం తదితర సామగ్రిని అందజేశారు. అనంతరం వృద్ధులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలన్నారు. గిరిజన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గిరిజనులకు తమ సంస్థ దానధర్మ చారిటబుల్ ట్రస్టు అండగా నిలుస్తోందన్నారు. కమిటీ సభ్యులు సత్యనారాయణరెడ్డి, రాంబాబు, రాజ్‌కుమార్‌రెడ్డి, సూర్యకుమారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ఔదార్యం



గర్భిణి కోసం రక్తదానం చేసిన ఏబీవీపీ నాయకులు

పాడేరు : జి.మాడుగుల మండలం గెంజిగెడ్డ గ్రామానికి చెందిన లోచలి ఝాన్సీ అనే గర్భిణి ప్రసవం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేరింది. ఆమెకు రక్తం అవసరం ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సూర్యారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు యోగి, నాయకులు వెంకట్, రమేష్ శనివారం జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. ఆమెకు రెండు యూనిట్ల రక్తం అవసరం కావడంతో వారు రక్తదానం చేసి ఔదార్యం చాటుకునానరు. దీంతో గర్భిణి ఝాన్సీ భర్త భీమశంకర్‌రావు రక్తదాతలు చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



వారపు సంతలో పోలీసుల గస్తీ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగే వారపు సంతలో వాహనాల రద్దీతో నెలకొన్న ట్రాఫిక్ అవస్థలపై ఎస్‌ఐ జె.రామకృష్ణ ప్రత్యేక దృష్టి పెట్టారు.సంతలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేయకుండా ప్రత్యేక పార్కింగ్ స్థలం కేటాయించి, రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుదల చేకుండా సంతలో పోలీసులతో గస్తీ నిర్వహించారు. చాలా రోజులుగా వారపు సంతలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను ఎస్‌ఐ పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ వారపు సంత రోజు ట్రాఫిక్ వల్ల కలిగే అవస్థలు తొలగించాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాహనదారులు, ఆటో, జీపు, వ్యాన్‌ల డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ,పోలీసులకు సహకరించి, మండల కేంద్రంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సహకరించాలని ఎస్‌ఐ రామకృష్ణ కోరారు.